


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శుక్రవారం 05 డిసెంబర్ 2025

వైఎస్ఆర్ కడప

పేజీలు - 08

గ్రామ స్వరాజ్య స్థాపన..

## దిశగా అడుగులు!

**పంచాయతీరాజ్ డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో**


**మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**




**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి చిత్తూరు నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డివిజినల్ డెవలప్మెంట్ ఆఫీసులను డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ..మిగతా 2పేజీలో

# అక్కడ చెరువులను రాసిస్తారు!





(కడప ప్రతినిధి– మేజర్‌న్యూస్)

రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదలు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వరకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే కొంత మంది అవినీతి అధికారులు వారి లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులైన చెరువులను, కుంటలను తమ సొంత జాగీరులా భావించి అక్రమార్కులకు రాయించేస్తున్నారు. రికార్డుల్లో చెరువుగా స్పష్టంగా కనిపిస్తున్నా అనువంశికం పేరుతో పట్టాలిస్తున్నారు. వందల ఎకరాలను దారాదత్తం చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే అంతా మాఇష్టం.. మమ్మల్ని అడ్డుకునేదెరు? అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వీరి అక్రమాలకు జిల్లా ఉన్నతాధికారుల పేర్లు వినియోగించుకుంటూ రూ.కోట్లు దండుకుంటున్నారు. ఈ తరహా ఘటనే బద్వేల్ రెవెన్యూ డివిజన్ పోరుమామిళ్ళ మండలంలో చోటు చేసుకుంది.

- ఆ అధికారికి అడ్డేలేదు?..
- ప్రభుత్వ భూముల ధారాదత్తం
- చెరువులు..కుంటలు అనువంశికం పేరుతో రాసిఇచ్చేస్తున్నారు
- అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడ్డుకునేదెరు?..
- అక్రమణదారులకు బహిరంగంగానే వత్తాసు..
- జిల్లా అధికారుల పేర్లు చెప్పి పబ్బం గడుపుకుంటున్న అధికారి?

పోరుమామిళ్ళ మండలంల పులివీడు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వేనంబర్ 56లో 13.18 ఎకరాల్లో చిన్నారెడ్డిపేట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువుపై కన్నేసిన కొంత మంది కబ్జాదారులకు అవినీతి అధికారులు అండగా నిలిచారు. ఈ చెరువును సాగు చేసుకునేందుకు అనువుగా అనువంశికం పేరుతో పట్టాలిచ్చారు. ఏకంగా చెరువులో తిమ్మారెడ్డి ఈశ్వరమ్మ మిగతా 2పేజీలో..

## పెట్టుబడులను ప్రోత్సహించాలి

**డీసీసీ, డీఎల్ఆర్సీ బ్యాంకర్ల సమావేశంలో జిల్లా జల కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు**



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** నూతన పరిశ్రమల స్థాపన, వ్యవసాయంలో అధునాతన సాంకేతికతను అవసరమైన పెట్టుబడుల కోసం రైతులకు ఋణ సహకారం అందించాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ ఆర్ సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు అందించడంలో సెప్టెంబర్ మాసంతానికి గాను.. వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే.. ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, ..మిగతా 2పేజీలో

**ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం**

**ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి**

పులివెందుల, మేజర్‌న్యూస్: 4లో

అక్రమ లేఅవుట్లపై మున్సిపల్..

## అధికారులు కొరడా..!

**అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది**

**మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి**



**బద్వేల్, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమ లేఅవుట్లు వేసిన నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలు పై కొరడా జులిపించారు. ఈ సందర్భంగా కమిషనర్ ..మిగతా 2పేజీలో

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో..

## కూటమి విఫలం

**రాష్ట్రంలో రైతుల గోడు పట్టించుకోని చంద్రబాబు**

**ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి**



**పులివెందుల, మేజర్‌న్యూస్:** ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీ తన నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ..మిగతా 2పేజీలో

కడప జిల్లాలో భారీగా

## ఎస్ఐల బదిలీలు

**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** కడప జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 23 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఆర్. శివనాగిరెడ్డిని తాళ్ల పొద్దుటూరు నుండి వల్లూరు పోలీస్ స్టేషన్, ప్రణ కుమార్ రెడ్డి ఒంటిమిట్ట నుండి ఆర్కే వేల్యూ పోలీస్ స్టేషన్ కు సూర్యనారాయణ రెడ్డి వియన్ పల్లె స్టేషన్ నుండి బి కోడూర్, అనిల్ కుమార్ లింగాల నుండి తార్ల పొద్దుటూరు, సుబ్బన్న పులివెందుల నుండి కలసపాడు, జగదీశ్వర్ రెడ్డి దువ్వూరు నుండి లింగాల, నాగ కీర్తన రాజుపాలెం నుండి అట్లూర్, ప్రదీప్ కుమార్ విఆర్ నుండి కడప వన్ టౌన్, మహమ్మద్ రఫీ వి ఆర్ కడప నుండి కడప టూ టౌన్ స్టేషన్ కు, జయ రాములు కడప ట్రాఫిక్ ..మిగతా 2పేజీలో

# కడప జిల్లాలో భారీగా ఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

నుండి బద్వేల్ స్టేషన్ కు మహబూబ్ బాషా వి ఆర్ కడప నుండి ప్రొద్దుటూరు టూ టౌన్ స్టేషన్ కు, చిరంజీవి వి ఆర్ కడప నుండి మైదుకూరు స్టేషన్ కు, పెద్ద బాబన్న వల్లూరు నుండి స్పెషల్ బ్రాంచ్ కడప, తిమోతి కలసపాడు నుండి పులివెందల, రామకృష్ణ అట్లూరు నుండి కడప టూ టౌన్, సిద్దయ్య కడప టూ టౌన్ నుండి కడప ట్రాఫిక్, ప్రతాప్ రెడ్డి కడప వన్ టౌన్ నుండి డిటిసి కడప, జయరాం రెడ్డి బద్వేల్ నుండి డి టి ఆర్ బి కడప, సుబ్బారావు మైదుకూరు నుండి డి సి ఆర్బి కడప, వెంకటరెడ్డి ప్రొద్దుటూరు టూ టౌన్ నుండి పిసిఆర్ ప్రొద్దుటూరు, విష్ణు నారాయణ ఎర్రగుంట్ల నుండి పులివెందుల ట్రాఫిక్ స్టేషన్ కు, శేషశైనారావు వి.ఆర్ కడప నుండి రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ కడప, నారాయణ పులివెందుల స్టేషన్ నుండి సైబర్ క్రైమ్ కడపకు బదిలీ చేస్తూ వెంటనే సంబంధిత స్టేషన్లలో రిపోర్ట్ చేసుకోవాలని కర్నూల్ రేంజ్ వారిని ఆదేశించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి విఫలం

(మొదటి పేజీ తరువాయి)


ముందుగా ప్రజల విద్యార్థులను స్వీకరించి, అనంతరం వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ అందరి సమస్యలను పరిష్కరిస్తానని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీకేమైనా సమస్య ఉత్పన్నమైతే దృష్టికి తీసుకువచ్చే పరిష్కరిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ బీసీ కులాల వారికి 50 సంవత్సరాల వారికి పెన్షన్లు, గూడు లేని ప్రతి ఒక్కరికి గృహ సౌకర్యం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైకాపా కార్యకర్తలు, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా..!

(మొదటి పేజీ తరువాయి)

నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనధికారక లే-అవుట్ ల క్రమ బద్ధీకరణ పథకం-2020లో భాగంగా మడకలవారిపల్లె రెవిన్యూ గ్రామపొలంలోని సర్వే నంబర్ 887 ను గురువారం తన సిబ్బందితోవిజిట్ చేసిన మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి మరియు టిపిబిఓ నరసయ్య లే అవుటను పరిశీలించారు. లేఅవుట్ యజమానిఇప్పటి వరకు ఈ లేఔట్ నందు ఎటువంటు ప్లాట్‌లు రెగ్యులరైజ్ కోసం దరఖాస్తులు నమోదు చేసుకోకపోవడంతో అనాధికారిక లే అవుట్ అని నిర్ధారిస్తూ లేఅవుట్ ముందు భాగములో నిర్మించిన బౌండరీ స్టోన్స్, కాంపౌండ్ గోడను తొలగించడం జరిగినది ఆయన తెలిపారు. ఇప్పటికైనా లేఅవుట్ క్రమబద్ధీకరణ పాలసీలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో 16 అనధికారిక లే అవుట్ ల ఉన్న ప్లాట్లు మరియు వ్యక్తిగత ప్లాట్ యజమానులు ఎల్ఆర్ఎస్-2020 ద్వారా దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందగలరని ఆయన తెలపారు.అట్లు లేనిచో ఎటువంటి నోటీసులు జారీ చేయకనే సదరు ప్లాట్లు నందు తగు చర్యలు గైకొన బడును ఆయన హెచ్చరించారు.చివరి తేదీ 23 జనవరి 2026 ఈ అవకాశం ఉన్నది కాబట్టి లేఅవుట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఏఎంసి డైరెక్టర్‌కు ఉపాధ్యాయులు ఘన సన్మానం



**అట్లూరు, మేజర్‌న్యూస్:** శ్రీవిద్య యుపీ స్కూల్ అధినేత పోలుబోయిన కుప్పయ్య యాదవ్ బద్వేల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నియామకం పొందడంతో ఉపాధ్యాయ సిబ్బంది గురువారం ఆయనను స్కూల్ ఆవరణంలో శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ లో ఇంకా ఉన్నతమైన పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు

# అక్కడ చెరువులను రాసిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

భర్త నరసింహారెడ్డి పేరు మీద 10 ఎకరాలు, అలాగే తిమ్మారెడ్డి నరసింహారెడ్డి తండ్రి నర్సిరెడ్డి పేరు మీద 3.18 ఎకరాలు పట్టాలిచ్చారు. ఆమేరకు అడంగల్ లో నమోదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 మ్యూటేషన్ ఆమోదించినట్లు ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది. కానీ గత ఏడాది రికార్డుల వరకు పరిశీలించినా 56 సర్వేనంబర్‌లో 13.18 ఎకరాలు చెన్నారెడ్డిపేట చెరువు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే మండల రెవెన్యూ అధికారులు ఎంతలా భరితెగించి వ్యవహరిస్తున్నారో చెప్పకనే అర్థమవుతుంది. ఇది ఉదాహరణ మాత్రమే. మండల రెవెన్యూ అధికారుల తీరు తీవ్ర వివాదస్పదంగా మారింది. ఎందుకిలా చేశారని ఎవరైనా ఆరా తీసినా వారి వద్ద నుంచి నిర్లక్ష్యపూరిత సమాధానాలు ఎదురవుతాయి. మా ఇష్టం!.. మీరెవరు?అడిగేందుకు?.. అంటూ ఎదురు ప్రశ్నలతో హడలెత్తిస్తుంటారు. మరో సందర్భంలో జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల పేర్లు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. ఇదే రెవెన్యూ అధికారులు లేని సర్వేనంబర్లను సృష్టించి బెంగళూరు-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నష్టపరిహారం పొందేందుకు సహకరిస్తున్నారు. ఇటీవల చిన్నారెడ్డిపేట చెరువును అనుభవిస్తున్న ఓ వ్యక్తి తప్పుడు సర్వేనంబర్లతో (అంటే చిన్నారెడ్డిపేట గ్రామ పొలంలో 73 సర్వేనంబర్) ప్రభుత్వం నుంచి రూ.34లక్షల నష్టపరిహారం పొందినట్లు తెలుస్తోంది. అదేవిధంగా 37 సర్వేనంబర్‌లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో అవినీతి రెవెన్యూ సిబ్బంకి కమీషన్ల రూపంలో భారీగానే ముట్టినట్లు సమాచారం. ఇక వివాదస్పద సర్వేనంబర్లను సైతం ఆన్‌లైన్ చేస్తూ తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ఓ రెవెన్యూ అధికారి పెద్దఎత్తున దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

**కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రక్షాళన చేస్తుంటే?..**

ఒక వైపు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లాలో రెవెన్యూను ప్రక్షాళన చేస్తూ అడుగులేస్తుంటే మరో వైపు పోరుమామిళ్ళలోని కొంత మంది రెవెన్యూ సిబ్బంది మాత్రం ఆయన లక్ష్యానికి బహిరంగంగానే తూట్లు పొడుస్తున్నారు. అందినకాడికి వెనకేసుకునేందుకు భారీ అక్రమాలకు పాల్పడుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి చెరువులు.. కుంటలు రాసిఇచ్చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ స్పందించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపించాల్సి ఉంది. లేకుంటే ఆయన తీసుకుంటున్న సమూల మార్పులతో ఆశించిన ఫలితం కనిపించదు.

# గ్రామ స్వరాజ్య స్థాపన..దిశగా అడుగులు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ కడప డివిజన్ డెవెలెప్మెంట్ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలలో పలు సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చామని, ఇందులో భాగంగా రాష్ట్రంలో 77 డివిజినల్ డెవలప్మెంట్ ఆఫీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి డిడిఓ, డి ఎల్ పి ఓ, ఏపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలందించనున్నా రన్నారు. డివిజినల్ డెవలప్మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రతి పంచాయతీ స్వయం ప్రతిపత్తి కలిగి స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలను తీర్చగలుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను సమీకృతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయవచ్చున్నారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖల పాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా జిఓఎంఎస్ నెంబర్ 57, 58 లను తీసుకు రావడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో అభివృద్ధి శాఖకు ఎంపిడిఓ లు, రెవెన్యూ శాఖకు తహశీల్దార్ లు, పోలీస్ శాఖకు సర్కిల్ ఇన్స్పెక్టర్ లు ఉంటారని, వీరికి సంబంధించి రెవెన్యూ మరియు పోలీస్ శాఖకు మాత్రమే డివిజినల్ కార్యాలయాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల తో ఇక పై పంచాయతీరాజ్ శాఖకు కూడా ఒక డివిజినల్ స్థాయి అధికారి ఉంటారన్నారు. గ్రూప్ 1 ద్వారా కూడా ఈ పోస్ట్ లను భర్తీ చేయవచ్చున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలను ఆశిస్తున్న యువతకు ఒక గొప్ప అవకాశం అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ సంస్కరణల ద్వారా పాలనా పారంగా రెట్టింపు ఉత్సాహంతో పని చేయడంతో పాటు పిఆర్ అండ్ ఆర్డి శాఖ మరింత బలోపేతం చేసినట్లు కానుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, కడప డీఎల్ పివో భాస్కర్, కడప డివిజన్ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా అభివృద్ధి, సాధికారిత... పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ -2047 దిశగా "వైఎస్ఆర్ కడప జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29" ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్న ఆకాంక్ష జిల్లాను రాష్ట్ర, దేశ అభివృద్ధితో పాటు.. గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులు స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తిని, బిజినెస్ స్కిల్స్ ను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం బ్యాంకర్లు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి.ఆర్థిక చేయూతనిచ్చి జిల్లాను ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు.

**చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించాలి..**

అంతేకాకుండా కడప సమృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను, రైతులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని.. అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్దిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. అభివృద్ధి తిరోగమనంలో ఉన్న ఆయా బ్యాంకు శాఖలు అందుకు కారణాలను తెలియజేయాలన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్టాండప్ ఇండియా", ముద్ర, గ్రామీణ ఖాదీ బోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు.. పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రత్యేకించి జేఎంఎల్ బిసి (జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ) మీటింగ్స్ కు సంబందిత అన్ని శాఖల



అధికారులు ఖచ్చితంగా హాజరవ్వాలన్నారు. ఈ స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నూతన పరిశ్రమల ఆవిష్కరణకు అవసరమైన వనరులపై చర్చించాలన్నారు. సైబర్ క్రైమ్స్ జరుగుతున్న నేపథ్యంలో అధిక మొత్తంలో అనుకోకుండా అనుమానాస్పద లావాదేవీలు ఏవైనా జరుగుతున్నాయని గుర్తించినట్లయితే.. అలాటి లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల పట్ల జిల్లాలో గ్రామీణ స్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించేలా బ్యాంకర్లు ప్రణాళికలు రూపొందించుకొని అవగాహన కల్పించాలన్నారు.

**69.76 శాతం ఆర్థిక ప్రగతిని సాధించాము...**

కార్యక్రమంలో ముందుగా.. జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం... డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కు సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ కి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 2025 సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.21,739.77 కోట్లకు గాను.. రూ.15,167.14 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 69.76% ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రీజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ (విజే -ఆర్ఓ) రాజేష్ కుమార్ కుంద్, యూబీఐ ఎజిఎం లక్ష్మీ తులసి, ఏపీజిబి ఎజిఎం శ్రీనివాస ప్రసాద్, కెడిసిసి సీఈఓ రాజమ్మ, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ శ్రీకిరణ్, డిఆర్డీఏ, మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్ కుమార్, అనుబంధ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

### దుకాణాలను తనిఖీ చేసిన తహసిల్దార్ సంజీవరెడ్డి




**దువ్వూరు, మేజర్‌న్యూస్:** ప్రజలకు నిత్యవసర సరుకులు రేషన్ దుకాణాలలో సక్రమంగా పంపిణీ చేయాలని మండల తహసిల్దార్ యెమిరెడ్డి సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన దువ్వూరులోని రెండు రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దువ్వూరులోని రెండు చౌక దుకాణాల్లో రికార్డులను తనిఖీ చేసి, కార్డుదారులకు నిత్యవసర వస్తువులు సక్రమంగా అందజేయాలని సూచించారు. తూకాలలో తేడా ఉండకుండా చూడాలని ఆయన డీలర్లకు సూచించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదు వస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ జాన్సన్, వీఆర్వో జహీరుద్దీన్ వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం

### హాజరుకానున్న ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి

### మండల టీడీపి అధ్యక్షుడు ఎస్పీజిఆర్ వెల్లడి



**పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్:** మండలంలోని గంగనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈరోజు 9 గంటలకు జరగబోవు పేరెంట్స్ మీటింగ్ నకు కమలాపురం శాసనసభ్యులు పి. కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎస్.పి.జి.ఆర్. ఓ ప్రకటనలో తెలుపుతూ కూటమి సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## కలసపాడు ఎస్సై తిమోతి బదిలీ



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్సై ఎల్ తిమోతి బదిలీలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులివెందులకు బదిలీ కావడం జరిగింది అక్కడ పనిచేస్తున్న ఎస్సై సుభాన్ కలసపాడుకు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు గత కొన్ని నెలలుగా కలసపాడు విధులు నిర్వహించిన ఎస్ఐ ఎల్ తిమోతి పార్టీలకతీతంగా పనిచేసే అందరికి మన్నలను పొందారు.

## చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ

### చల్లా అందుబాటులో లేని కారణంగా మిత్రబృందం నిర్వహణ



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** మార్గశిర మాస పౌర్ణమి సందర్భంగా గురువారం స్థానిక రెండవ పట్టణ పోలీసు స్టేషను సమీపంలోని చిన్నమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద టిడిపి పట్టణాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 300 మంది ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. పాల్గొన్న ప్రజలంతా చల్లా రాజగోపాల్ యాదవ్ సేవా నిరతిని కొనియాడారు. అతనికి సహకారం అందిస్తున్న మిత్రబృందం, కుటుంబ సభ్యులను అభినందించారు. పలుమార్లు ఆయన అందుబాటులో లేకున్న సమయంలో మిత్రబృందం ద్వారా అన్నప్రసాద సేవ కొనసాగించి ఆయనకు పరోపకారం పట్ల వున్న మక్కువను చూపారని కొనియాడారు. కాగా ప్రస్తుతం కూడా చల్లా రాజగోపాల్ యాదవ్ అందుబాటులో లేని కారణంగా కార్యక్రమానికి అంతరాయం లేకుండ మిత్రబృందం కొనసాగించడం అభినందనీయమన్నారు.

## ఫుడ్ బాస్కెట్‌పై యన్‌యఫ్‌యఫ్ అరుణ అవగాహన కార్యక్రమం




**కలసపాడు, మేజర్‌న్యూస్:** కలసపాడు మండలం ఎగువ రామాపురం గ్రామంలో రైతు సాధికార సంస్థ నుండి హెల్త్ అండ్ న్యూట్రిషన్ సిబ్బంది ఫుట్ బాస్కెట్ గురించి యన్ యఫ్ ఏ అరుణ మాట్లాడుతూ ఎగువరామాపురం గ్రామంలో గ్రామ సంగం మీటింగ్‌లో ఫుడ్ బాస్కెట్ మొదలు పెట్టడానికి గల కారణాలు ఎక్కువగా కలుషితమైన ఆహారం తినడం వల్ల ఎక్కువగా అనారోగ్య అనారోగ్యాలు ఏర్పడడం, బీపీ షుగర్లు పెరగడం ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవ్వడం జరుగుతుంది, రసాయనాలు వేసి పండించడం ద్వారా భూమి ఆరోగ్యం కూడా పాడవుతుంది వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి ఇవన్నీ జరగకుండా అందరూ ఆరోగ్యంగా ఉండాలి అంటే ప్రకృతి వ్యవసాయం కచ్చితంగా చేయాలి అని తెలియజేయడం జరిగింది ప్రతి ఒక్క కుటుంబం కూడా ఎలాంటి రసాయనాలు పురుగుమందులు వాడకుండా మనం తీసుకునే ఆహారంలో నిత్యం సమతుల్య ఆహారము ఉండాలని తెలియజేయడం జరిగింది పూర్తిస్థాయిలో మంచి సమతుల్య ఆహారం తీసుకోవాలి అంటే ప్రతి కుటుంబంలో కూడా ఐదు నుంచి ఏడు రకాలు ఫుడ్ గ్రూప్స్ తీసుకోవాలి మరియు ప్రతి ఇంట్లో కూడా పెరటి తోటలో అనేది పెంచుకోవాలి అదే విధంగా మనం బయట నుంచి తీసుకొచ్చుకునే నిత్యవసర సరుకులు కూడా పూర్తిస్థాయిలో ఎలాంటి రసాయనాలు లేకుండా ఉండాలని తెలియజేయడం జరిగింది అందుకుగాను గ్రామంలో పూర్తి విషపూరిత రసాయనాలు లేకుండా ఎక్కడైతే ప్రకృతి వ్యవసాయం చేస్తారో అక్కడ నుండి రైతుల దగ్గర నుండి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన నిత్యవసర సరుకులను తీసుకొని ప్రతి కుటుంబం వాడుకోవాలి అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో విఓఏ రమణమ్మ మాట్లాడుతూ పొదుపు సంగంలో వున్నా ప్రతి మహి ళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్ర మంలో మహిళలు యన్‌యఫ్‌యఫ్ ప్రత్యూష,రామకోటి పాల్గొన్నారు.

## లింగాల వనంబావి వద్ద శ్రీ కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం



**లింగాల, మేజర్‌న్యూస్:** లింగాల మండలంలోని లింగాల సమీపంలో ఉన్న వనం భావి వద్ద వెలసిన శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా జరిపిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7:00 గంటలకు స్వామివారికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు అన్నదాన కార్యక్రమాలు జరిపించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలియదు తెలిపారు. అలాగే ఉదయం 10 గంటల నుండి కట్టెల కోలన్న కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటల నుండి గంగా హారతి జ్యోతులు కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే రాత్రి9:00 నెల్లూరు వారిచే లక్ష్మీ కుమార్ ఈవెంట్స్ వారిచే ఆర్టిస్ట్ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 12 :00 గంటలకు జ్యోతి ప్రజ్వలం ఈ కార్యక్రమం కోసం భక్తులు 12 :00 గంటల వరకు వేచి చూసి ఈ జ్యోతి కార్యక్రమం కనులు విందుగా చూసి దర్శనం చేసుకున్నారు. కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవానికి లింగాల మండలంలో పలు గ్రామాల నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు, మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవాలు



**కాశినాయన,మేజర్‌న్యూస్:** మండలంలోని జ్యోతి క్షేత్రమునందు కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ జ్యోతి క్షేత్రంలో జరిగే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలలో భక్తులు వేలాది మంది పాల్గొని కాశిరెడ్డి నాయన జ్యోతిని చూసే దర్శన భాగ్యం కలిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి, సీఐ కలసపాడు, కాశినాయన, బి. కోడూరు పోరుమామిళ్ల, సర్కిల్ పరిధిలో ఉన్న సిబ్బందితో కార్యక్రమం సజావుగా సాగిందని ఆయన అన్నారు.

## పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

### వైసీపీ మండల అధ్యక్షులు కొండారెడ్డి




**రాజుపాళెం,మేజర్‌న్యూస్:** గ్రామస్థాయిలోపార్టీసిద్ధాంతాలులక్ష్యాలనుప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో వైసిపిగ్రామ కమిటీలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు బాణా వెంకటకొండారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఉప్పలపాడు,వాసుదేవపురం గ్రామాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలనునియమించారుఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సారథ్యంలో గ్రామ కమిటీ సభ్యులు పార్టీ అభివృద్ధి కోసంకష్టపడి పని చేయాలన్నారు ప్రజలతో మమేకమై తరచుగా సమావేశాలు కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వైసిపి పార్టీ బలోపేతానికిపాటు పడాలని సూచించారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు జీరెడ్డి, అంజని కుమారి, పరిశీలకులు మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వాసుదేవపురం సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, నాగేష్, ఇంద్రసేనారెడ్డి, రవీంద్రారెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిభందనలు తప్పనిసరి

### మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ట్రాఫిక్ నిభందనలు తప్పనిసరి పాటించాలని, ప్రమాదాల నివారణకు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై తిరుపాల్ నాయక్ సూచించారు. గురువారం పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. అనంతరం మాట్లాడుతూ మైనర్ లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు బద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బద్వేల్ ఏఎంసి డైరెక్టర్ కుప్పయ్య యాదవ్‌కు యాదవ సంఘం ఘన సన్మానం



**అట్లూరు, మేజర్‌న్యూస్:** బద్వేల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా అట్లూరు మండల టిడిపి జనరల్ సెక్రటరీ, ముత్తుకూరు మాజీ సర్పంచ్ పోలుబోయిన కుప్పయ్య యాదవ్ నియామకం పొందారు ఈ సందర్భంగా గురువారం బద్వేల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ్ లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో బద్వేలు శ్రీకృష్ణదేవరాయ కమిటీ చైర్మన్ సింగరయ్యయాదవ్, కువైట్ ఎన్నారై అధ్యక్షుడు ఉంటా నరసింహులు యాదవ్, చిన్నకేశం పల్లె మాజీ సర్పంచ్ రమణయ్య యాదవ్, బద్వేల్ మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు బాల చెన్నయ్య యాదవ్, పోరుమామిళ్ల సింగల్ విండో డైరెక్టర్ కాకా సుబ్రహ్మణ్య యాదవ్, యాలపల సుబ్బరాయుడు యాదవ్, భూపాల్ యాదవ్, గున్నంరాజు పల్లె టిడిపి ఇన్చార్జ్ నూకల శీను యాదవ్, భక్త పోతుల గురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి ఘటన దురదృష్టకరం

## వైసిపి రాష్ట్ర బిసి సెల్ జాయింట్ సెక్రటరీ బ్రహ్మయ్య యాదవ్



**మైదుకూరు మేజర్‌న్యూస్ :** అన్నమయ్య జిల్లా రాయచోటి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ ఇంటిపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనుచరులు పట్టపగలు ఇనుప రాడ్లతో దాడి జరపడం దురదృష్టకరమని వైసిపి బిసి సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చింతకుంట బ్రహ్మయ్య యాదవ్ (బుజ్జి )ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దాడులు చేయడం సిగ్గు చేటు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గురించి మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ విజయభాస్కర్ మీడియా నోట్ విడుదల చేస్తే దానికి ప్రతీకారంగా దాడి చేయటం ఏమిటన్నారు. గుంపులుగా వెళ్లి ఆయన ఇంటిపై దాడి చేయడం అత్యంత అమానుషం అన్నారు.ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు కావడం ఎంతో బాధాకరమన్నారు .ప్రస్తుతం రక్తగాయాలతో ఆసుపత్రిలో ఉన్న విజయభాస్కర్ కు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.

# సమస్యాత్మక కేసులను సత్వరమే పరిష్కరించాలి

## డిఎస్పి జి. రాజేంద్రప్రసాద్



**చాపాడు మేజర్‌న్యూస్ :** సమస్యాత్మక కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చురుగ్గా చర్యలు చేపట్టాలని చాపాడు సబ్ ఇన్స్పెక్టర్ చిన్న పెద్దయ్యను మైదుకూరు డిఎస్పి జి. రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. చాపాడు పోలీస్ స్టేషన్ ను గురువారం డిఎస్పి ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ను తనిఖీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే సమస్యలపై పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించడంతో పాటు వారికి భరోసా ఇచ్చేలా పోలీసులు వ్యవహరించాలన్నారు. పలు కేసులకు సంబంధించి చార్జిషీట్ల దాఖలుపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రధాన కూడళ్లలో, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని, వాటిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకరయ్య యాదవ్ మరియు చాపాడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్ .సి. ఎన్. స్పాన్సర్షిప్ విద్యార్థులకు దుస్తుల పంపిణీ




**కలసపాడు మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవ స్థాపకులైన డాక్టర్ గీత, థామస్ రెడ్డి, ల సహాయ సహకారాలతో విద్యార్థినీ విద్యార్థులకు క్రిస్మస్ పండగ సందర్భంగా దుస్తులు, దుప్పట్లు, మైండ్ గేమ్, మరియు నైతిక విలువలు నేర్పు పుస్తకాలను, పాఠశాల కరస్పాండెంట్ చిత్తా, రాజశేఖర్ రెడ్డి మరియు ప్రిన్సిపల్ చిత్తా, ప్రభావతి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామమైన కలసపాడు నందు కార్పొరేట్ స్థాయిలో విద్యార్థిని విద్యార్థులకు విద్యనందించాలని సంకల్పంతో, పాఠశాల ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతంలో ఉన్న తల్లి తండ్రి లేక ఒంటరిగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి స్పాన్సర్షిప్ ప్రోగ్రాం ని ఏర్పాటుచేసి, వారి భవిష్యత్తుకు పునాదులు వేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు చేసుకొని మంచిగా చదివి ఉన్నత ఉద్యోగాలను సంపాదించుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాదేవరెడ్డికి అభ్యుదయ రైతు పురస్కారం



**మైదుకూరు మేజర్‌న్యూస్ :** మైదుకూరు మండలం మిట్టమానుపల్లె గ్రామానికి చెందిన రైతు వుమ్మడి మహాదేవరెడ్డికి అభ్యుదయ రైతు పురస్కారం లభించింది. రంగారెడ్డి జిల్లా నందిగామ సమీపంలోని ప్రసిద్ధి హార్ట్ ఫుల్ సెంటర్ కన్హాశాంతి వనంలో గురువారం జరిగిన మహా కిషన్ మేళా సందర్భంగా మిట్టమానుపల్లెకు చెందిన రైతు వుమ్మడి మహాదేవరెడ్డికి అభ్యుదయ రైతు పురస్కారం లభించిందని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలియజేశారు. 75 సంవత్సరాల వయసులో కూడా చాలా చల్లాకిగా ఉంటూ వినూత్న వ్యవసాయ ఉద్యాన పంటలకు శ్రీకారం చుడుతూ ప్రతి ఒక్క రైతుకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, మల్బరీ సాగు, పెరటి కోళ్ల పెంపకం, గొర్రెలు మరియు మేకల పెంపకం, మామిడి, జామ, అల్లనేరేడు, సీతాఫలం, వేరుశనగ తదితర పంటలను తన వ్యవసాయ క్షేత్రంలో పండిస్తూ భూసారన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ తనదైన శైలిలో అధిక ఉత్పత్తులను సాధిస్తున్నాడని, తాను చేసిన కృషిని గుర్తించి కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట శాస్త్రవేత్తలు మహదేవరెడ్డికి ఈ మహా కిషన్ మేళాలో జరుగు అభ్యుదయ రైతు పురస్కారానికి డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం తరఫున కమిటీ సభ్యుల ఆమోదం మేరకు ఈ పురస్కారానికి ఎంపిక చేసి పంపారు. ఈయనకు ఈ పురస్కారం రావడం వలన చాలామంది రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ అభ్యుదయ రైతును చాలామంది ఆదర్శంగా తీసుకోవాలని కెవికె శాస్త్రవేత్తలు సూచించారు.




# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

**కడప రిమ్స్, మేజర్‌న్యూస్ కడప :** మైదుకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితులను కడప రిమ్స్ హాస్పిటల్‌లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్వయంగా కలసి పరామర్శించారు.నిన్న సరస్వతిపేటకు చెందిన రైతు కూలీలు పొలం పనుల నిమిత్తం వెదురురుకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న ఆటోను ఒక కారు ఢీకొనడంతో దాదాపు 12 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరిని కడప రిమ్స్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు, బాధితుల ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే మెరుగైన మరియు అత్యవసర వైద్యం అందించాలని రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ మరియు సంబంధిత వైద్యులకు ఆదేశించారు. అలాగే గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ప్రభుత్వం వారి పట్ల అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఇక హాస్పిటల్‌లో కొంతమంది వైద్య సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గమనించిన ఎమ్మెల్యే గారు, సున్నితంగా హెచ్చరిస్తూ, రోగులకు సరైన సమయంలో నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం


## డిడిఓ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

**పులివెందుల, మేజర్‌న్యూస్:** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కృత నిశ్చయంతో ఉందని అందుకు అనుగుణంగా గురువారం పులివెందులలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖడివిజనల్ అభివృద్ధి అధికారి కా కార్యాలయాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, పులివెందుల జడ్పిటిసి మా రెడ్డి లతా రెడ్డి రాష్ట్ర బిజెపి నేత శశి భూషణ్ రెడ్డి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం. గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్ వ్యవస్థలను మరింత బలపరచడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా డిడిఓ కార్యాలయాలను ప్రారంభించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కార్యక్రమాల మరోపక్క పర్యవేక్షణను మరింత సమర్థవంతం చేయడంలో ఈ కార్యాలయం కీలక పాత్ర పోషించనున్నాయన్నారు. బిజెపి నాయకుడు శశి భూషణ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ వ్యవస్థ రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసి, రాష్ట్రంలో వైకాపా ఐదేళ్ల పాలనలో ఒక్క రోడ్డు కూడా నిర్మించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రోడ్ల నిర్మాణాలపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు, పంచాయతీ శాఖ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సచివాలయ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేయండి

## జనసేన నేత దాసరి రవిశంకర్



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** సచివాలయాల పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు జనసేన నేత డా.దాసరి రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక 6వ సచివాలయాన్ని సందర్శించారు. అలాగే సమస్యలపై ఆరాతీసారు. సచివాలయంలో మౌలిక వసతులు, ప్రజల వినతుల పట్ల సిబ్బందిని అడిగా తెలుసుకున్నారు. సాయంత్రం వెళల్లో మందు బాబుల బెడదతో మందు సీసాలు, ప్లాస్టిక్ గ్లాస్ లు ఎక్కడ చూసిన సచివాలయ పరిసరాల్లో దర్శనమిస్తున్నట్లు సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, తగిన చర్యలు చేపట్టాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గంగులయ్య, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైసిపి కన్వీనర్ జన్మదిన వేడుకలు

## రోగులకు పండ్లు పంపిణీ



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సీపి మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆ పార్టీ నాయకులు కమతం రాజా, అంజీ, పోలేపల్లి గణేష్ ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు చేపట్టారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు వైసిపి కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి జన్మదిన వేడుకలను రోగుల మధ్య నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటివి మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు బిఎస్ షేక్షావలి, కురాకుల వెంకటేష్, ఉత్తమారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దువ్వూరు మండలంలో వైసీపీ గ్రామ కమిటీల నియామకం ప్రారంభం

### మండల వైసీపీ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మైదుకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు దువ్వూరు మండలంలో వైసీపీ గ్రామ పంచాయతీ కమిటీల నియామక కార్యక్రమం ప్రారంభించినట్లు దువ్వూరు మండల వైసిపి కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్న సింగన పల్లె గ్రామంలో గ్రామ కమిటీల పై వైసిపి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో కమిటీల నియామకం కీలకమని,పార్టీ శక్తిని గ్రామ పంచాయతీల దాకా విస్తరించేందుకు ఈ కార్యక్రమం మరింత దోహదపడుతుందని తెలిపారు. ఈనెల 18వ తేదీ లోపల మండలంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, నారుపల్లె విజయభాస్కర్ రెడ్డి, బొమ్ము ఓబులరెడ్డి, అమ్మిరెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి , ఇరగరెడ్డి రమణారెడ్డి, వెంకటాపురం హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించండి

### అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్:** పులివెందుల అంకాలమ్మ పేట, భారతి వీధిలోని అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తనిఖీ చేశారు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు అన్నారు. చిన్నారులకు అందించాల్సిన ఆహారం, సేవలలో ఎలాంటి అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు కేంద్రాలలో పిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉందని తక్కువ ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం రికార్డులను పరిశీలించారు అలాగే గర్భవతులకు బాలింతలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలన్నారు.

## రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ పులివెందుల అధ్యక్షులుగా చంద్రమోహన్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్:** పులివెందుల నియోజకవర్గానికి చెందిన మాచి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులుగా జాతీయ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచెర్ల వెంకట సర్వోత్తమ రెడ్డి , జాతీయ కన్వీనర్ వల్లపురెడ్డి వెంగళరెడ్డి , వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షులు బోరెడ్డి వరదారెడ్డి మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంలోచంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఏ రెడ్డి కుటుంబానికి ఇబ్బంది వచ్చినా, నేను నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ, రెడ్లందరినీ ఐక్యతగా ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తాను. సమాజంకోసం పనిచేయడం నా కర్తవ్యం" అని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ మాట్లాడుతూ "పులివెందుల నేల రెడ్డి సమాజానికి శిరోమణి ప్రాంతం. ధైర్యం, సేవాభావం, నాయకత్వం ఇవి పులివెందుల రెడ్ల ప్రత్యేకత. ఈ సంప్రదాయానికి మరింత గౌరవం తీసుకువచ్చే నాయకుడు మాచి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి అని పేర్కొంది.పులివెందుల ప్రాంతంలో అట్టడుగు రెడ్డి కుటుంబాల అభివృద్ధి విద్యార్థులు-యువతకు సేవా కార్యక్రమాలు, సమస్యల పరిష్కారానికి అండ సమాజ ఐక్యతను బలోపేతం చేయడం మరింత బలంగా ముందుకు సాగుతాయని రాష్ట్ర కమిటీ నమ్మకం వ్యక్తం చేసింది.

# సిఆర్ఎంటిల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

### ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి రమణారెడ్డి

**కలసపాడు మేజర్‌న్యూస్ :** పనికి తగిన వేతనం అందక చాలీచాలని జీతాలతో ఏ ఊరు ఇబ్బందులు పడుతున్న క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎంటి) సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఆర్ఎంటి లు చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం కలసపాడులోని ఎంఈఓ ఆఫీసు దగ్గర ఉపాధ్యాయ సంఘ నాయకులకు వినతిపత్రం అందజేసిన సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎంఈఓ లకు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు మరియు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్య వారధిగా ఉండి అనేక రకాలుగా సహకరిస్తూ, విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న సిఆర్ఎంటి ల సమస్యల పరిష్కారంలో మాత్రం ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం సరికాదన్నారు.వారి ప్రధానమైన సమస్యలైన విలీనమైన క్లస్టర్లలోనే కొనసాగించాలని, ఖాళీగా ఉన్న సిఆర్ఎంటి పోస్టులను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని, 9 సంవత్సరాలుగా పెరుగుదల లేకుండా ఉన్న వేతనాలను తక్షణమే పెంచాలని,స్పష్టమైన జాబ్ చార్ట్ రూపొందించాలని, విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ట్రావెలింగ్ అలవెన్స్ లను పునరుద్ధరించాలని, డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని, పిఎఫ్ మరియు గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టకపోతే వారి ఉద్యమ కార్యాచరణకు ఎస్టియు మద్దతు ఇచ్చి వారి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.వినతి పత్రం అందజేసిన వారిలో సిఆర్ఎంటిలు జోహార్ తాజ్, మధుసూదన్ రావు,ఓబయ్య ఉన్నారు.



# 21న పల్స్ పోలియో కార్యక్రమం - డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప టౌన్, మేజర్‌న్యూస్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అధ్యక్షతన పల్స్ పోలియో కార్యక్రమం పై,ఆర్సీహెచ్ 2.0 కార్యక్రమం పై, జెండర్ బెస్ వైలెన్స్ పై, స్క్రబ్ టైపస్ వ్యాధిపై అవగాహన కల్పించుటకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయము నందు సమావేశము నిర్వహించడం జరిగినది.ఈనెల 21 వ తేదీన జరగబోయే "పల్స్ పోలియో" కార్యక్రమములో 0-5 సంవత్సరముల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేపించవలయునని, హై రిస్క్ ఏరియాలలో ఉండే 0-5 సంవత్సరముల పిల్లలను గుర్తించాలని, వివిఎం,రిపోర్టింగ్ ఫార్మేట్స్ గురించి తెలుపుతూ, పల్స్ పోలియోని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాలాధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ వైద్యాధికారులకు తెలియజేశారు. మాతా శిశు సంరక్షణ కొరకై అందించే వైద్య సేవలు అన్నియు క్రమం తప్పకుండా ఆర్సీహెచ్ పోర్టల్ లో ఎప్పటికప్పుడు ఆన్లైన్ నందు నమోదు చేయవలెనని డాక్టర్ ప్రవీణ్ డి.పి.ఎమ్.ఓ. తెలియచేశారు. లింగ ఆధారిత హింస, లీగల్ కేర్ పై గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, సమాజంలో ఆడ, మగ సమానమేనని, మహిళలకు విద్యా, ఆర్థిక స్వాతంత్రము, సామాజిక గౌరవము, చట్టపరమైన రక్షణ అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజుతెలిపారు. స్క్రబ్ టైపస్ వ్యాధిపై ఎం.ఎల్.హెచ్.పి లు , ఆశ, ఏ.ఎన్.ఎం. ల ద్వారా ప్రజలలో అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు ఆదేశించడం అయినది. ఈ కార్యక్రమములో డిఎఎల్టిఓ డాక్టర్ రవి , డిఎస్ఓ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డెమో భారతి, ప్రోగ్రాం ఆఫీసర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.






# ప్రజా సమస్యలపై సత్వరమే పరిష్కారించండి

### జడ్పీటీసీ ఎమ్.రవికుమార్ రెడ్డి



వేంపల్లె మేజర్‌న్యూస్: ప్రజా సమస్యలపై దృష్టి సారించి, తక్షణమే పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు ఎమ్.రవికుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపిటిసి సభ్యులు వీరి పరిధిలోని పలు సమస్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్ల వ్యవస్థ, పారిశుధ్యం, తాగునీరు సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వీటిపై ప్రత్యేక దృష్టితో పరిష్కార మార్గం చూపాలని కోరారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాల బ్రేక్ టైమ్ లో పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని, పిరమిడ్ నగర్ అంగన్వాడీ కేంద్రం వద్ద వర్షపు నీరు, మురికి కాలువ నీరు నిల్వ ఉండి, విద్యార్థులకీ, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదే ప్రాంతంలో కరెంట్ పోళు వంగి ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వెల్లడించారు. స్థానిక పంచాయతీ పరిధిలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ కోసం, జల జీవన్ మిసన్ కింద పైప్ లైన్ ఏర్పాటుకు రోడ్లు తవ్వారని, దీంతో ప్రజలకు ఇబ్బంది తలెత్తినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మెగా పేరేంట్స్ మీటింగ్ ని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా నిర్వహించాలని కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయిత్రీ, వైస్ ఎంపీపీలు రమణమ్మ, మెహతాబ్, ఎంపిడిఓ కుళాయమ్మ, అధికారులు, ఎంపిటిసిలు పద్మా జయలక్ష్మీ, భారతి, కటిక చంద్రశేఖర్, మణిగోపాల్ రెడ్డి, హబిబుల్లా, చంద్ర ఓబుల్ రెడ్డి, పఠాన్ రహంతుల్లా, ప్రదీప్ కుమార్ రెడ్డి, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్సీపి ఆధ్వర్యంలో ఇంటి స్థలాలకు దరఖాస్తులు నమోదు

### 16న చలో కార్పోరేషన్ కి వేలాదిగా తరలిరండి

### ఆర్.సి.పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి




కడప టౌన్, మేజర్‌న్యూస్: పేదలందరికీ ఇంటి స్థలాలు వచ్చేంతవరకు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన పోరాడి సాధిస్తుందని, అర్హులైన వారు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆర్.సి.పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం టూ టౌన్, మృత్యుంజయ కుంట ప్రాంతాలలో, తస్లీమ్, బాల చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటి స్థలాల దరఖాస్తులను నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూనగరంలో ఇంటి స్థలాల కోసం 30, 40, సంవత్సరాల నుండి ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలకు నోచుకోవడం లేదని, ఒక ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు కలసి నివసిస్తున్నారని, ఇలాంటి వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలను, నివాస గృహాలను మంజూరు చేయాలని అయన కోరారు. గత ప్రభుత్వాలు వారి వారి గొప్పల కోసం, ఎన్ని లక్షల మందికి ఇల్లులు ఇచ్చాం అని చెప్పుకోవడానికి సంఖ్య ఉపయోగపడిందే కానీ! క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ ఇళ్లను ఇవ్వలేకపోయారన్నారు. దినిని గమనించిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ తామే దరఖాస్తులను నమోదు చేయిస్తుందని, పేదలందరికీ ఇంటి స్థలాలు వచ్చేంతవరకు వారి పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహిస్తుందని, ఈనెల 16వ తేదీన చలో కార్పోరేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చాంద్‌బేగం,కరిమున్, ఆయేషా, శంకరయ్య పాల్గొన్నారు.

# నేడు అర్జున్ హాస్పిటల్ కు అపోలో చెన్నై డాక్టర్ రాక

కడప టౌన్, మేజర్ న్యూస్ : నగరంలోని నెహ్రూ పార్క్ ఎదురుగా, డాక్టర్ బాలిరెడ్డి హాస్పిటల్ లైన్ లో ఉన్న అర్జున్ హాస్పిటల్ కు అపోలో చెన్నై కి చెందిన కన్సల్టెంట్ హెపటాలజీ, లివర్ ఫిజీషియన్ డాక్టర్ యు.వి.యు. వంశీధర్ రెడ్డి ఈనెల 5వ తేదీ వస్తున్నట్లు హాస్పిటల్ ఛైర్మెన్ డాక్టర్ అర్జున్ కుమార్ అవ్వారు ఒక ప్రకటనలో తెలిపారు. కామెర్లు, సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, దీర్ఘకాలంగా తీవ్రమైన కాలేయం వైఫల్యం, ఆల్కహాల్, కాలేయ వ్యాధులు, హెపటైటిస్ బి.సి, ఆటో ఇమ్యున్ కాలేయ వ్యాధులు, గర్భిణీల్లో, చిన్నపిల్లలలో కాలేయ వ్యాధులు, హెపటో సెల్యులార్ కార్సినోమా, కాలేయ మార్పిడి,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిత్తాశయ వ్యాధులు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాగరాజు



**కడప టౌన్ , మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్టీయుసి నగర అధ్యక్షుడు నాగరాజు పూలబుకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పుడున్న గవర్నమెంట్ కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు గురించి చర్చించడం జరిగింది. కార్మికుల ఇబ్బందులు ఇటీవలి కాలంలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, పనిస్థలాల్లో భద్రతా లోపాలు, సామాజిక భద్రతా సౌకర్యాల లేకపోవడం ముఖ్యమైనవి. చాలామంది కార్మికులు తమ కుటుంబ కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో జీవించాల్సి వస్తోంది. పనిభారం ఎక్కువైనా, సరైన గుర్తింపు లేదా ప్రోత్సాహం అందకపోవడం కూడా వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కొన్ని రంగాల్లో కాంట్రాక్ట్ పద్ధతులు పెరగడంతో ఉద్యోగ భద్రత తగ్గి, కార్మికులు నిరంతరం అనిశ్చితిలో కూరుకుపోతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి తెలపడం జరిగింది. న్యాయమైన వేతనాలు, భద్రతా ప్రమాణాల అమలు, కార్మిక సంక్షేమ పథకాలు అవసరం అని వివరించడం జరిగింది. అదేవిధంగా వాహనాలకు ఫిట్నెస్ చార్జీలు టాక్సు పెంచడం జరిగింది దాని వలన సొంత వాహనదారులు డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలపడం జరిగింది. 2029 లో మన గవర్నమెంట్ వస్తూనే కచ్చితంగా కార్మికుల కష్టాలు తీరుతాయని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది.

# భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయుని జయంతి వేడుకలు





**బి కోడూర్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో సమీపంలో వెలిసియున్న అనఘదేవి సమేత దత్తాత్రేయుని దేవస్థానము నందు శ్రీ దత్తాత్రేయుని జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా గురువారంఆలయ నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ యానాది రెడ్డి శారదమాట్లాడుతూ ప్రతి సంవత్సరము దత్తాత్రేయుని జయంతి వేడు కలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జయంతి వేడుకల సందర్భముగా సూర్యోద పూర్వం వేకువ జామున 5 గంటల నుంచి ఏడు గంటల వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి మంగళ స్నానములు,అభిషేక కార్యక్రమాలను వీచించారు. స్వామివారి పూజా కార్యక్రమాలు వేద పండితులు ప్రదీప్ , శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. దత్తాత్రేయుని జయంతి పూజకార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయుని దర్శించుకోవడం జరిగిందన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామి వారికి తమ నామ గోత్రాలతో ప్రత్యేక పూజలు జరిపించుకొని కాయా కర్పూరం అందజేశారు అనంతరం పురోహితులు వేదమంత్రాలు నడుమ అర్చన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు

# జెనెటిక్స్ అండ్ జినోమిక్స్‌లో ప్రతిభావంతులకు బంగారు పతకం.. అధికారుల ఉదారత

### ఒప్పంద పత్రాలపై వై.వీ.యూ అధికారుల, అధ్యాపకుల సంతకాలు

**వై. వి. యు, పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఎం.ఎస్సీ జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగంలో ప్రతిభావంతులకు బంగారు పథకం ఇవ్వడానికి ఆ శాఖ అధ్యాపకులు ముందుకు వచ్చి ఉదారత ను చాటారు. ప్రతి ఏటా జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ పీజీ కోర్సులో అత్యున్నత ర్యాంక్ పొందిన విద్యార్థికి బంగారు పతకం ప్రదానం చేసేందుకు అవసరమైన రూ. 1,25 లక్షలు విశ్వవిద్యాలయానికి అందించారు. ఈ మొత్తం ద్వారా వచ్చే వడ్డీని బంగారు పతకానికి వెచ్చించాలని కోరారు. ఈ మేరకు నిధులు ఇచ్చిన ఆ శాఖ అధ్యాపకులు డా. ఎ. ముని కుమారి, డాక్టర్. ఎల్. దాక్షాయణి, డాక్టర్. బి. రమేష్, డాక్టర్. పి. ఉస్మాన్ బాష విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు తో కలిసి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులను వి.సి. అభినందించారు. విద్యార్థులలో విద్యా నైపుణ్యాన్ని గుర్తించి వారికి బంగారు పతకం ఇవ్వడానికి ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి సంవత్సరం స్నాతకోత్సవ కార్యక్రమంలో బంగారు పతకాన్ని ప్రదానం చేస్తామని ఉపకులపతి తెలిపారు.




# అట్టహాసంగా బద్వేల్ ఏఎంసి డైరెక్టర్ కుప్పయ్య యాదవ్ ప్రమాణ స్వీకారం

### భారీగా తరలి వెళ్లిన టిడిపి శ్రేణులు

**అట్లూరు, మేజర్‌న్యూస్:** బద్వేల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా అట్లూరు మండలం ముత్తుకూరు పంచాయతీ బోడిశెట్టి పల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోలుబోయిన కుప్పయ్య యాదవ్ నియామకం పొందారు బుధవారం బద్వేల్ లోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు ఈ సందర్భంగా కుప్పయ్య యాదవ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్వగ్రామం నుండి భారీగా టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు టిడిపి నాయకులు, కార్యకర్తలు బంధుమిత్రులు, శాలువాలు కప్పి, పూలమాలలతో బాణ సంచాలు కాలుస్తూ, బ్యాండ్ చప్పుల మధ్య ర్యాలీగా సభా వేదిక దగ్గరకు తీసుకెళ్లారు అనంతరం కుప్పయ్య యాదవ్ ఏఎంసీ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం ఆయనకు రితీష్ రెడ్డి, విజయమ్మలు అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కుప్పయ్య యాదవ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమాల గురించి వివరించారు రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే విజయమ్మ లు నన్ను నమ్మి ఏఎంసీ డైరెక్టర్ గా అవకాశం కల్పించినందుకు ఇరువురికి ధన్యవాదాలు తెలిపారు నామీద పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం కూడా తగ్గకుండా పార్టీ కోసం పార్టీ బలోపేతమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ ఇంచార్జ్ రెడ్డయ్య రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు అల్లం వెంకటసుబ్బయ్య , టిడిపి యువ నాయకులు కొమ్మూరు గురు ప్రసాద్ రెడ్డి, ముత్తుకూరు శివాలయం ఆలయ అర్చకులు కృష్ణయ్య శర్మ , నరసింహారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, పాపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, మస్తాన్, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు





సూర్య www.suryaa.com

శుక్రవారం 05 డిసెంబర్ 2025

## ఫింఛన్ వచ్చేందుకు కృషి చేసిన షేక్ అమానుల్లా



**కడప టౌన్ , మేజర్‌న్యూస్ :** భర్త చనిపోయిన పింఛన్ భార్యకి భార్య చనిపోయిన భర్తకి ఈ పథకం చాలా మంది నిరుపేదలకు ఉపయోగపడుతున్నదని తెలుగు దేశం పార్టీ 27 వ డివిజన్ గౌస్ నగర్ 165 వ బూత్ ఇన్చార్జి షేక్ అమానుల్లా అన్నారు.భర్త చనిపోగా ఆపివేసిన ఫింఛన్ వృద్ధురాలైన భార్యకు వచ్చేలా చేశామని తెలిపారు.ఇందుకోసం సచివాలయం, కార్పోరేషన్ అధికారులను కలువగా,వారు స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఏ ప్రభుత్వం చేయని పని మన పేదల పాలిట ప్రభుత్వము చేస్తున్నదని తెలిపారు.పేదల కోసం సంక్షేమం కోరుకునే పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఇలాంటి ఎన్టీఆర్ భరోసా పింఛన్ రావడం చాలా ఆనందంగా ఉంది అని బాధిత మహిళ కళ్ళల్లో ఆమె మాటల్లో ఆనందం వ్యక్తం చేసిందని చెప్పారు.కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి,తెదేపా నాయకులు వాసు,నగరపాలక అదనపు కమిషనర్ కు ఈ సంధర్భంగా తెదేపా నాయకులు షేక్ అమానుల్లా,లయన్ పటాన్ ఖాదర్బాషలు ధన్యవాదాలు తెలిపారు.

## అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో హెూమాలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక ఆగస్త్యేశ్వర ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామివారికి అమ్మవారికి తెల్లవారుజాము నుండి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, అలాగే గోపూజతో ప్రారంభమై చండీ మహా హెూమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఆలయ ఈవో జే వెంకటసుబ్బయ్య, ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలిసభ్యులు, అర్చకలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అనఘాదేవి దత్తాత్రేయ స్వామి కల్యాణ మహెూత్సవం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక శివాలయం సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం శ్రీపాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదిక పై ఆశీనులను చేశారు. సుహుహూర్తంలో వేదపండితుల మంత్రోచ్చారణలు. మంగళ వాయిద్యాల మధ్య ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు దత్తాత్రేయస్వామి మహిమలను ఆయన పూజించడం వల్ల కలిగే శుభాలను వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి స్వామి, అమ్మవారిని 'భక్తిశ్రద్ధలతో పూజించారు. డిస్కో రమణ ఆధ్వర్యంలో భక్తిగీతాలకు కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఏర్పాట్లను శ్రీపాదవల్లభసేవా సంఘం అధ్యక్షుడు చింతకుంట జయచంద్ర, సభ్యులు, భక్తులు పర్యవేక్షించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో.. స్థానిక వైఎంఆర్ కాలనీలోని అవధూత దత్త పీఠం వారి సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో గురువారం దత్తాత్రేయ స్వామి వారి జయంతి మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు.

# జగన్ పాలనలో రైతు పంట వేస్తే భయం పంట కోస్తే నష్టం

### పులివెందుల టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ వర్ధన్ రెడ్డి



పులివెందుల మేజర్‌న్యూస్: రైతుల తాత తండ్రుల పేర్ల మీద దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములను లాక్కోవాలనే దురాశతో ల్యాండ్ టైటిలింగ్ చట్టం చేసిన జగన్ మోహన్ రెడ్డికి రైతుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో రైతు పంట వేస్తే భయం, పంట కోస్తే నష్టం అమ్మితే డబ్బులు రావటానికి నెలలు పట్టేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సమస్యలను ఒక్కోటి సీరియస్‌గా తీసుకుని 24 గంటల్లో చెల్లింపులు 48 గంటల్లో క్లియర్ బిల్లులు అనే పారదర్శక వ్యవస్థను తీసుకువచ్చింది. రైతుల కోసం కూటమి ప్రభుత్వం చేసిన కీలక చర్యలు సత్ఫలితాలను ఇస్తుంది. వైసిపి ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 1,674 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే క్లియర్ చేసింది. వైసీపీ ఇవ్వకుండా వదిలేసిన రైతు ఆత్మహత్యల కుటుంబాలకు ?5.67 కోట్లు కూటమి ప్రభుత్వం అందించింది. గత 18 నెలల్లో రైతులకు 800 కోట్లు మద్దతు ధరల రూపంలో ఇచ్చింది.పొగాకు, ఉల్లి, టమాటా, మామిడి, కోకో రైతులకు రికార్డు స్థాయిలో ధరల స్థిరీకరణ నిధులు విడుదల చేసింది. వైసీపీ పాలనలో చెల్లించకుండా ఉంచిన 1,990 కోట్ల పంట బీమా ప్రీమియం కారణంగా రైతులు పడిన నష్టాలను కూటమి ప్రభుత్వం సరిచేసింది.పంట భీమాను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసి రైతులకు రక్షణ కల్పించింది.2024-25 ఖరీఫ్, రబీ సీజన్లకు 13,858 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. అని వారన్నారు. వరి పంటకు ఇన్‌పుట్ సబ్సిడీని ?17,000 నుండి 25,000కు పెంచింది. అని పేర్కొన్నారు. ఉల్లి ధరలు పడిపోయిన ప్రతిసారీ వ్యత్యాస మొత్తాన్ని నేరుగా రైతుకే చెల్లిస్తోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే జగన్ మాత్రం సొంత మీడియాతో అబద్ధాలుప్రచారం చేసి ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని కానీ కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు రైతులకు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.

## రాజకీయ భీష్మాచార్యుడు రోశయ్య



వేంపల్లె మేజర్ న్యూస్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయ భీష్మాచార్యుడని, గొప్ప ఆర్థికవేత్త అని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. గురువారం రోశయ్య వర్థంతి సందర్భంగా చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా, అధ్యక్షునిగా రోశయ్య ఎనలేని సేవలు చేశారన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మంత్రి, ఎంపి, ముఖ్యమంత్రిగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఎంతో సేవ చేశారని, తమిళనాడు, కర్ణాటక గవర్నర్‌గా ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. అలాగే ఘంటసాల 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ ఘంటసాల గాన గంధర్వుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతిమణి అలివేలమ్మ, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం


### - కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, వీరికి న్యాయం చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఫక్కిరపల్లి, మదీనాపురం వైసిపికీ చెందిన మైనార్టీ నాయకులు, పులివెందులలో ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే తమ సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. మైనారిటీ సోదరులంతా ఎల్లవేళలా వైసిపితో ఉంటామని, తమకు అండగా నిలిచే పార్టీ వైసిపి మాత్రమే అని ఎంపితో అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రహంతుల్లా, నాయకులు గుజరి దర్బార్, ఖదీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించుకునేందుకే ప్రజాదర్బార్

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ప్రజలు వారి సమస్యలను పరిష్కరించు కునేందుకే ప్రజా దర్బార్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేను స్వయంగా కలిసి పలు రకాల సమస్యలను వినతుల ద్వారా తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు.




## పాలనను మరింత చేరువ చేసే లక్ష్యంతో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు..!

### కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ.

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభించ మని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలిపారు. ఏర్పడిన తర్వాతఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 70కి పైగా డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది అని ఈ కార్యక్రమంలో భాగంగా బద్వేలు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని బద్వేల్ మాజీ శాసనసభ సభ్యురాలు శ్రీమతి విజయమ్మ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలకు డివిజనల్ స్థాయిలో త్వరితగతిన పరిష్కారం లభించేందుకు ఈ కార్యాలయం కీలకంగా మారుతుంది అని. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ తీసుకొచ్చిన ఈ సంస్కరణ ప్రజలకు మరింత సేవ చేస్తుందనే నమ్మకం ఉంది అని



పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి రంగంలో ఈ విప్లవాత్మక చర్యకు మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు కమిషనర్ కి ధన్యవాదాలు వారు తెలిపారు. అలాగే ఈ కార్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక సహకారం అందించిన జిల్లా నీటి నిర్వహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ ఆదిశేషా రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బద్వేలు డివిజనల్ అభివృద్ధి అధికారి వివి. శేషయ్య, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మైథిలీ, బద్వేలు మండల అభివృద్ధి అధికారి డి. మల్లేశ్వరి, బద్వేలు డివిజన్ పరిధిలోని మండల అభివృద్ధి అధికారులు, డిప్యూటీ మండల అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పేదల సొంత ఇంటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో అధికారులు నిర్మాణాలు చేపట్టాలి

### టిడిపి ఇన్‌చార్జ్ రితీష్ రెడ్డి



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** పేదలతన సొంత ఇంటి కలను త్వరగా నిజం చేయాలి అనే లక్ష్యంతో అధికారులునిర్మాణాలు చేపట్టి వారిని గృహప్రవేశాలు చేసే విధంగా పనిచేయాలని టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి అన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0, 2.0 సమీక్ష గురువారం సమావేశం నిర్వహించిన అనంతరం. బద్వేల్ మునిసి పాలిటీ పరిధిలో వల్లెర వారి పల్లెలో నిర్మాణంలో ఉన్నటువంటి ప్రధానమంత్రి అర్బన్ హౌసింగ్ ఇళ్లను హౌసింగ్ పీడీ కలిసి బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కే రితీష్ రెడ్డి వాటి పురోగతి మౌలిక సదుపాయాలపై ఆరా తీయడం జరిగింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద మంజూరైన 5600 ఇళ్ల నిర్మాణ పురోగతిలో ప్రస్తుతం కొన్ని ఇళ్ల పనులు బేస్మెంట్ దశలో, మరికొన్నివి గోడల వరకు, ఇంకొన్ని స్లాబ్ వరకు పూర్తి అయినట్లు పరిశీలించాను. పేదల సొంత ఇంటి కలను త్వరగా నిజం చేయాలి అనే లక్ష్యంతో, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాను.కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని గుర్తుచేస్తూ, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ?23 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపాను. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద స్వంత భూమి కలిగిన వారికి మంజూరైన 1200 ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభం కావడానికి, వారికి పోజిషన్ సర్టిఫికెట్లు వెంటనే అందించాలని హౌసింగ్ పీడీ గారికి సూచించాను. బద్వేల్ మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ కూడా ఈ సమీక్షలో పాల్గొని, పేదలకు ఇచ్చే ఇళ్ల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పనులు త్వరగా పూర్తి చేసి త్వరలోనే ఇళ్లను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి రాజారాం, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి , మండల పార్టీ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి ఎల్ఎస్‌బి డ్యాం చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు, బాలికలకు రక్షణ కవచం 'శక్తి' యాప్

### సి.కె. దిన్నె సి.ఐ బాలమద్దిలేటి



**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్:** జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రతి మహిళ సురక్షితంగా ఉండేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు సి.కె. దిన్నె సి.ఐ బాలమద్దిలేటి తెలిపారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లు మరియు కంపెనీల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.గురువారం కొప్పర్తి పారిశ్రామిక వాడలోని టెక్సానా కంపెనీలో మహిళా కార్మికులకు ఆయన 'శక్తి' యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు వెంటనే సాయం పొందేందుకు 'శక్తి' యాప్ ఎంతో కీలకమని ఆయన వివరించారు.

**శక్తి యాప్ ఉపయోగం – ఎలా పనిచేస్తుంది..**

ఏదైనా ప్రమాదం, వేధింపులు, అనుమానాస్పద పరిస్థితి ఎదురైనా యాప్‌లోని ఎస్ఓఎస్‌బటన్ నొక్కితే లేదా 112 నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరుతుందని సి.ఐ తెలిపారు. అత్యవసర సాయం కోసం కేవలం 10 నిమిషాల్లో పోలీసుల బృందం ఘటనాస్థలికి చేరుకుంటుంది అని స్పష్టం చేశారు.
మహిళల రక్షణ కోసం ముఖ్య హెల్ప్‌లైన్ నంబర్లు 100/112 – అత్యవసర సహాయం, 1098 – చైల్డ్ లైన్ (పిల్లల రక్షణ), 181 – గృహ హింస ఫిర్యాదులు, 1091– మహిళల వేధింపుల ఫిర్యాదులు, 1930 – సైబర్ నేరాల టోల్ ఫ్రీ

**సైబర్ మిత్ర – సైబర్ అవగాహన సేవ**

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాల నుండి తప్పించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించిన సి.ఐ బాలమద్దిలేటి, ప్రతి మహిళ తన హక్కులు, చట్టాలు తెలుసుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమం లో సి. ఐ. బాల మద్దిలేటి తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించాలి!

### ఐసిడిఎస్ పీడి పి. రమాదేవి



**కడప ప్రతినిధి – మేజర్‌న్యూస్ :** శిశు సంరక్షణా కేంద్రాల పిల్లల పట్ల బాధ్యతగా, ప్రేమ, సేవా దృక్పథంతో వ్యవహరించాలని ఐసిడిఎస్ పీడి పి. రమాదేవి నిర్వాహకులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ డి.బ్లాక్ లోని మహిళా అభివృద్ధి %ఢ% శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలోని డిస్టిక్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ లో "పిల్లలకు సంబంధించిన చట్టాలు మరియు శిశు సంరక్షణ సంస్థలలో కనీస సంరక్షణ ప్రమాణాలు రక్షణ నిర్వహించడంపై చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ నిర్వాహకులకు, సిబ్బందికి శిక్షణ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి. రమాదేవి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలలో ఉంటున్న పిల్లలు తల్లిదండ్రులు కోల్పోయి, కుటుంబ బాంధవ్యాలకు దూరమై ఉన్న పిల్లలు ఎక్కువగా ఉంటారు కావున పనిచేస్తున్న ప్రతి సిబ్బంది కూడా పిల్లల పట్ల ప్రేమగా, ఆప్యాయతతో పిల్లల పట్ల వ్యవహరించాలని అప్పుడే వారు మానసికంగా దగ్గరయి వారి యొక్క సమస్యలన్నీ వారు పంచుకుంటారని తెలియజేశారు. అనంతరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ కడప ఇన్చార్జ్ సూపర్డెంట్ డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల కు వచ్చే పిల్లలు ఎక్కువగా వివిధ రకాల పరిస్థితుల ప్రభావాలకు గురై ,భావోద్వేగాల సమస్యకు గురి అయినటువంటి పిల్లలు వస్తారు అటువంటి పిల్లల యొక్క మానసిక పరిస్థితి తెలుసుకోవటానికి వారి ఐక్యూ లెవెల్స్ గుర్తించి వారు అనుగుణంగా వారితో సిబ్బంది ప్రేమగా, మార్పు తీసుకురావచ్చు, అదేవిధంగా పిల్లలలో ఎటువంటి ప్రవర్తనను ఉంటాయి వాటికి కారణాలు వాటికి పరిష్కార మార్గాలను తెలియజేస్తూ,కొన్ని జెనిటిక్ ప్రాబ్లమ్స్ ద్వారా ఉన్నటువంటి మానసిక ప్రవర్తన లోపాలను గుర్తించినప్పుడు మెంటల్ హెల్త్ సెంటర్ కి తీసుకొచ్చి ట్రీట్మెంట్ ఇప్పించడం వంటివి చెయ్యాలని తెలియజేశారు. జిల్లా పరివీక్షణాధికారి రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలలో ఉండవలసిన నియమాలల గురించి తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి, బి.ఆర్.సుభాష్ యాదవ్ మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బంది పిల్లల పట్ల అంకిత భావంతో వారి భావోద్వేగాలను అర్థం చేసుకుంటూ వారి పట్ల బాధ్యతతో మెలగాలని వారి అభివృద్ధికి దోహదపడాలని తెలియజేశారు. జిల్లా బాలల పరిమితుల విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలలో బాలల న్యాయ చట్టం ప్రకారము ఎటువంటి రికార్డ్స్ మరియు డాక్యుమెంట్స్ నిర్వహించాలి అనేటువంటి విషయాలను తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ శాంత, నోడల్ ఆఫీసర్ శోభారాణి, బాలల సంరక్షణ కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# సమానత్వం ఇంటి నుంచే మొదలు పెట్టాలి

### బాలికల విద్యే కుటుంబ బలం – పిల్లలకు సమానత్వ పాఠాలు
### జెండర్ అవగాహన శిక్షణలో – ఎస్సై పెద్ద ఓబన్న





**వల్లూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధి లోని వల్లూరులో సమాఖ్యలో సమైక్యవాళ్లు నిర్వహించిన జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ సభ్యుల రెండు రోజుల శిక్షణా కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా ముగిసింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వల్లూరు ఎస్సై పెద్ద ఓబన్న లింగ సమానత్వం ప్రాముఖ్యత, మహిళల భద్రత, పిల్లల అవగాహన, కుటుంబ, సామాజిక బాధ్యతలపై వివరించారు, శిక్షణలో అంగన్వాడీ సూపర్వైజర్లు, సీసీలు, సంఘ సభ్యులు, మండల ఏపీఎం యామిని పూర్ణిమలతో కలిసి ఎస్సై పెద్ద ఓబన్న మాట్లాడుతూ లింగ సమానత్వం అంటే అమ్మాయికి, అబ్బాయికి విలువలో తేడా లేకుండా చూడటం, ఇది ఉపదేశం కాదు, ప్రతి కుటుంబం పాటించాల్సిన ముఖ్యమైన విధి, సమాజం సురక్షితం కావాలంటే మొదట ఇంట్లోనే సమానత్వం అమలుకావాలన్నారు, చిన్నప్పటి నుంచే పిల్లలకు జెండర్ విలువలు నేర్పాలని, అమ్మాయి, అబ్బాయి రెండింటినీ సమానంగా చూడాలని కుటుంబాలకు సూచించారు, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లను కూడా వివరించారు, ప్రతి మహిళ, ప్రతి యువతి, ప్రతి అమ్మా, నాన్న తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన నంబర్లు ఇవి అని 112 అత్యవసర సేవలు, 1091 మహిళల హెల్ప్‌లైన్, 1098 చిన్నారుల హెల్ప్‌లైన్, సమస్య వచ్చినప్పుడు సంకోచం వద్దు, వెంటనే కాల్ చేయండి పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు అన్నారు, చదువు ఒక అమ్మాయి జీవితాన్ని మాత్రమే మార్చదు, ఒక కుటుంబాన్ని ముందుకు నడిపిస్తుందని చదువుకున్న అమ్మాయి ఆత్మవిశ్వాసం కలిగి ఉంటే సమాజం మొత్తం లాభపడుతుందన్నారు, విద్యతోనే ఆర్థిక, సామాజిక అసమానతలు దూరం అవుతాయిని దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు, సమాజంలో మహిళలపై హింస, వేధింపులు, చిన్న చూపు వంటి ప్రవర్తనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని స్పష్టం చేస్తూ ఏ రూపంలోనైనా హింస జరిగితే దాన్ని తేలికగా తీసుకోవద్దు, చూసినవారు కూడా స్పందించాలి, సమాజం భయంలేని వాతావరణం పొందాలి అంటే మహిళా భద్రతపై ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు, జెండర్ ఈక్వాలిటీ అనేది కేవలం మహిళల సమస్య కాదు, సమాజం మొత్తం ముందుకు సాగాల్సిన దారి, ఒక అమ్మాయికి చదువు, భద్రత, అవకాశాలు ఇస్తే ఒక తరం మారుతుంది, ప్రతి ఇంటిలో తల్లిదండ్రుల ఆలోచన మారితే సమాజం స్వయంగా మారుతుంది అని చెప్పారు, అదేవిధంగా మహిళలు ఆర్థికంగా బలపడాలి, నిర్ణయాల్లో భాగస్వామ్యం కలిగి ఉండాలి, పిల్లలకు చిన్నప్పటి నుంచే సమానత్వాన్ని నేర్పించాలని ఇది మనందరి బాధ్యత అన్నారు, ఏపిఎం యామిని పూర్ణిమ మాట్లాడుతూ లింగ సమానత్వం అంశంపై విస్తృతంగా చర్చించి అవగాహన పెంపొందించారు, శిక్షణ ముగింపు సందర్భంగా అందరూ కలిసి మహిళా భద్రత, బాలల రక్షణ, సమాన హక్కుల కోసం గ్రామ స్థాయిలో మరింతగా పనిచేయాలని నిర్ణయించారు.

## శివనామ స్మరణతో రూపరంపేట శివాలయము చుట్టూ గిరి ప్రదర్శన




**గోపవరం, మేజర్‌న్యూస్:** బద్వేల్ పట్టణంలో అతి పవిత్రమైన రూపురాంపేటలో వెలసియున్న శివానంద స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ఏపీఐఐసి డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి ఆలయ చైర్మన్ శంకర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు గిరి ప్రదర్శననిర్వహించాలని సంకల్పముతో కార్యక్రమాన్ని తలపెట్టగా గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలియగానే పట్టణ పరిధిలోని భక్తులు అదే విధంగామహిళలు పెద్దలు గిరి ప్రదర్శనలో పాల్గొని పురియహితులు గిరి ప్రదర్శన కోసం ప్రత్యేకంగా అలంకరింపజేసిన శివపార్వతుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో స్వామివారి పల్లకి మోసి బత్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా గిరి ప్రదర్శన సందర్భంగా శివనామస్మరణతో భక్తులు భజనలు చేస్తూ ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఎంతో వైభవముగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన పురోహితులు పెంచలయ్య స్వామి తోపాటు ఆయన భక్తులు గిరి ప్రదక్షిణ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగాఏపీఐఐసి డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిసిన వెంటనే అధిక వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా స్వామివారి గిరి ప్రదర్శన కార్యక్రమములో భక్తులు స్వచ్ఛందముగా పాల్గొనివిజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా ధన్యవాదములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సూర్య
www.suryaa.com
KADAPA కడప జిల్లా
శుక్రవారం 05 డిసెంబర్ 2025

# వై.వి.యూ లో ఎం.బీ.ఏ శాఖ : రెండు రోజుల జాతీయ వర్క్ షాప్

**వై. వి. యు, పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** యోగివేమన విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో క్రాస్ ఫంక్షనల్ మేనేజ్మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్" పేరుతో రెండు రోజుల వర్క్ షాప్ ను ఈనెల 5, 6 తేదీలలో విద్యాలయ ప్రాంగణంలోని అన్నమాచార్య సెనేట్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధిపతి, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ పి. సరిత తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ హాజరవుతుండగా, విశిష్ట అతిథులుగా కులసచివులు ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, డీన్ ప్రొ సుబ్బరాయుడు, హాజరవుతున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చరత శిక్ష అభియాన్ (పీఎం ఉష) సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వర్క్ షాప్ నకు రీసోర్స్ పర్సన్లు గా ప్రముఖ వక్తలు ప్రొఫెసర్ ఆర్. కాసి లింగం (పాండిచ్చేరి విశ్వవిద్యాలయం, పుదుచ్చేరి), ప్రొఫెసర్ డి.వి. శ్రీనివాస కుమార్ (హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్), డాక్టర్ సి. గణేష్ కుమార్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్), డాక్టర్ ఎ.ఎస్. పి. మురుగన్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్) హాజరవుతున్నారని తెలిపారు. పీఎం ఉషా సమన్వయకర్త డా. టి. చంద్రశేఖర్, వై వి యు ఎంబీఏ శాఖ విద్యార్థులు ,ఫ్యాకల్టీ పాల్గొంటారని వివరించారు. వ్యాపార విజయ విశ్లేషణలు, ఆర్థిక ప్రాముఖ్యత అనువర్తనాలు. మానవ వనరుల ప్రాధాన్యత, మార్కెటింగ్ అనలిటిక్స్ గురించి నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు.

# కాశిరెడ్డి నాయనకు ప్రత్యేక పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్:** పులివెందుల నియోజకవర్గం లోని లింగాల మండలం లింగాల గ్రామ సమీపం లో వనం బావి వద్ద ఉన్నటువంటి శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన స్వామి ఆరాధన సందర్భంగా. పులివెందుల జడ్పిటిసి మారెడ్డి లతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మారెడ్డి లతా రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు అనంతరం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం చేశారు.

# పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



**వేంపల్లె మేజర్‌న్యూస్:** పదోతరగతి పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు అన్నారు. యుటిఎఫ్ మండల ట్రెజరీ టివి రమణ సహకారంతో గురువారం పాములూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం చెరుకూరు శ్రీనివాసులు మాట్లాడుతూ యుటిఎఫ్ గత 25 ఏళ్ల అనుభవజ్ఞులైన మేధావుల చేత స్టడీ మెటీరియల్ తయారు చేయించి గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ స్టడీ మెటీరియల్ ద్వారా 70 నుంచి 80 శాతం మార్కులు సాధించేందుకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలావుల్లా, ఉపాధ్యాయులు గుప్తా, దస్తగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్ఎంటిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

## ఎంఈఓ ప్రసాదుకు వినతి

**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** క్లస్టర్ రిజర్వుమొబైల్ టీచర్లు సి ఆర్ ఎం టి లకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రసాదుకుగురువారంవినతిపత్రం అందజేశారు ఏపీ క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లు సిఆర్ఎంటి యునైటెడ్ ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విద్యశాఖఅధికారులకు వినతిపత్రం అందజేసినట్లు కోట భార్గవి లత సుబ్బరాయుడు తెలిపారు 2016 పిఏబి అనుసరించి 2019 మార్చి నెల నుండి ఇప్పటివరకు వేతన పెంపుదల చేయలేదన్నారు దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పని భారం పెరిగినప్పటికీ తగిన వేతనం అందించలేదని తెలిపారు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఎంఈఓకు తెలిపారు.

# నేల వనరుల స్థిరమైన నిర్వహణ కోసం దినోత్సవం

## నేడు ప్రపంచ నేల దినోత్సవం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ నేల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 5న జరుపుకుంటారు. ఈ రోజు ఆరోగ్యకరమైన నేల యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది మరియు నేల వనరుల స్థిరమైన నిర్వహణ కోసం పిలుపునిస్తుంది. ఈ దినోత్సవం నేల ఆరోగ్యం మరియు పరిరక్షణకు సంబంధించిన నిర్దిష్ట అంశాలపై దృష్టి సారిస్తుంది, ఇది భూమిపై జీవాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్య ఉద్దేశ్యం: ఆరోగ్యకరమైన నేలల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం మరియు నేల వనరుల స్థిరమైన నిర్వహణను ప్రోత్సహించడం. ప్రాముఖ్యత: నేల అనేది ఆహారం, నీరు, జీవవైవిధ్యం మరియు శక్తికి మూలం, కాబట్టి దానిని సంరక్షించడం మానవాళికి అత్యంత ముఖ్యం. సవాళ్లు: నేల కోత, కాలుష్యం, అటవీ నిర్మూలన మరియు సరికాని భూ వినియోగ పద్ధతులు వంటివి నేల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అవగాహన: ఈ రోజు నేల మరియు నీటి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తు చేస్తుంది, మరియు వాటి రక్షణ ఆవశ్యకతను నొక్కి చెబుతుంది.

**నేల కాపాడుకోవాల్సిన ఆవశ్యకత**



నేలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత చాలా ఉంది, ఎందుకంటే అది మానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు కీలకం. ఆరోగ్యకరమైన నేల నీటిని నిలుపుకుంటుంది, పంట దిగుబడిని పెంచుతుంది, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుంది మరియు జీవవైవిధ్యాన్ని పెంచుతుంది. నేల క్షీణత వల్ల ఆహార భద్రతకు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. **నేల పరిరక్షణ ఆవశ్యకతకు కారణాలు:** జీవనాధారం: మనం తినే ఆహారం నేల నుంచే వస్తుంది. నేల బాగుంటేనే పంటలు బాగా పండి మనకు ఆహారం లభిస్తుంది. పర్యావరణ సమతుల్యత: ఆరోగ్యకరమైన నేల గాలి, నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. నేల క్షీణత వల్ల వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం పెరుగుతాయి. **నీటి వనరులు:** ఆరోగ్యకరమైన నేల నీటిని బాగా నిలుపుకుంటుంది, ఇది భూగర్భ జలాలను పెంచడానికి సహాయపడుతుంది. **పంటల ఉత్పత్తి:** ఆరోగ్యకరమైన నేల పంటలకు కావాల్సిన పోషకాలను అందించి, దిగుబడిని పెంచుతుంది. **జీవవైవిధ్యం:** నేలలో అనేక సూక్ష్మజీవులు, జీవులు జీవిస్తాయి. నేల ఆరోగ్యం వాటి మనుగడకు అత్యవసరం.

**భవిష్యత్ తరాలు:** మన పూర్వీకులు మనకు అందించిన స్వచ్ఛమైన పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే నేలను కాపాడుకోవడం మన బాధ్యత. **నేలను ఎలా కాపాడుకోవాలి?**

పంట వ్యర్థాలను కాల్చడం మానుకోండి: పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేల క్షీణించి, వాయు కాలుష్యం పెరుగుతుంది. **సేంద్రియ పదార్థాన్ని పెంచండి:** కంపోస్ట్ లేదా సేంద్రియ ఎరువులను వాడటం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

పంటల భ్రమణం: వివిధ రకాల పంటలను పండించడం, కవర్ క్రాప్స్ (కప్పి ఉంచే పంటలు) వేయడం వల్ల నేల ఆరోగ్యం కాపాడబడుతుంది.

**నేల ఒత్తిడిని తగ్గించండి:** పొలాలలో భారీ యంత్రాల వాడకాన్ని తగ్గించడం, సరైన టైర్లు వాడటం వల్ల నేల నష్టం తగ్గుతుంది. నీటి సంరక్షణ: కాంక్రీటు వంటి గట్టి ఉపరితలాలను తగ్గించి, నీరు నేలలో ఇంకేలా చూడాలి.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



**కమలాపురం మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని, సి గోపాలపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ప్రజలతో సమావేశం నిర్వహించారు అక్కడికి వచ్చిన ప్రజలతో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వీణ పల్లవి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారిని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను మంచి ప్రయోజకులుగా చేసే మాకు మీరు అవకాశం ఇవ్వాలని ఆమె వేడుకున్నారు. ఇప్పుడు ఉన్న ఎంపీపీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారని వచ్చే సంవత్సరంలో ఇద్దరు మాత్రమే విద్యార్థులు ఉంటే ఎలా అన్నారు. ఒకసారి తమకు అవకాశం ఇస్తే మీ పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో చూపిస్తామని పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పుల్లగూర స్నేహిత, వారందరి ముందు ఇంగ్లీషులో స్పీచ్ వినిపించారు. ఇంటింటికి తిరిగి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తాను కోరుతానని చెప్పడంతో ప్రజలు స్పందించి తమ పిల్లలను స్కూల్లో చేర్పిస్తామని తెలిపారు.

# కడపలో ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి



**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** ప్రముఖ గాయకులు ,సంగీత దర్శకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా కొండా పాలకొండయ్య ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య నెహ్రూ పార్క్ లో ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గాత్రంతో ఎన్నో ఉత్తమమైన పాటలను పాడిన ఘంటసాల విగ్రహాన్ని కడప నగరంలో నూతనము గా ఏర్పాటు కొరకు కళాకారులు,కళాభిమానులు ముందుకు రావాలని కోరారు. దీనిపై ఒక కమిటీ కూడా ఏర్పాటు చేసుకోవాలని అందుకు నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. సర్గీయ గాయకులు ఘంటసాల పాడిన ప్రతి ఒక్క పాట ఆణిముత్యమని అలాంటి అమర గాయకులు ఘంటసాల విగ్రహం ఏర్పాటు కొరకు ప్రభుత్వం అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళా అభిమానులు మా ఏవిఎస్ రాజు,సురేష్, రాయల్ కరీమ్ సంస్థ అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, ప్రముఖ న్యాయవాది భారవి , పాల్గొన్నారు

# రతనాల ఆలయంలో కుంకుమార్చన



**పొద్దుటూరు, మేజర్ న్యూస్:** స్థానిక పాత మార్కెట్ లో వున్న లలితా దేవి, రతనాల వెంకటేశ్వర స్వామి వారి (అన్నా చెల్లెలు) ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవారి మూలవిరాట్టులకు ప్రత్యేక గోక్షీర, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. సాయంత్రం లలితాదేవి ఉత్సవ విగ్రహానికి విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించడంతో పాటు మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిగింది. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# మహిళల భద్రతే పోలీసుల ధ్యేయం




**వేంపల్లె మేజర్‌న్యూస్ :** మహిళల బద్రతే పోలీసుల ధ్యేయమని వేంపల్లె ఎస్సై తిరుపాల్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని అలిరెడ్డిపల్లి గ్రామంలో బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు, మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. అలాగే ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా రక్షణ పొందవచ్చుని, వీటి పట్ల అవగాహన పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ టోల్ ఫ్రీ నెంబర్ ల ప్రాముఖ్యత గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.